# మంత్రిగారి తెలివి

- పులిపాక తాజుద్దీన్

కాంచీపురం రాజు కామేశ్వరవర్మ దగ్గర అతి విలువైన మూడు వజ్రాలు ఉండేవి. ఒక్కొక్క వజ్రం విలువ పదికోట్ల వరహాలు. తాతలనాటి నుంచి ఉన్న ఆ అపురూపమైన వజ్రాలను అతిభద్రంగా ఓ ప్రత్యేకమైన కోశాగారంలో దాచాడు కామేశ్వరవర్మ. ఎప్పుడైనా కరువు కాటకాలు తటస్థిస్తే, వాటిని ఏ చక్రవర్తికో అమ్మి లేక తాకట్టు పెట్టి, ఆ ధనంతో ప్రజల ఆకలి బాధలు తీర్చవచ్చని కామేశ్వరవర్మ ఆలోచన. ఆ వజ్రాల కోశాగారాన్ని కోశాధికారి రామన్నదొర భద్రంగా కాపాడేవాడు. అతను రాజుగారి నమ్మినబంటు.

ఇలా వుండగా రామన్నదొరకు నరాల సంబంధమైన వ్యాధి సోకింది. చికిత్సకూ, విశ్రాంతికీ, కనీసం నలభైరోజుల వ్యవధి తీసుకుంటుందని వైద్యులు చెప్పారు. చేసేదిలేక రాజుగారు అతనికి సెలవు మంజూరు చేశారు. కానీ వజ్రాలను కాపాడే భాద్యత ఎవరికి అప్పగించాలో రాజుకు అర్థం కాలేదు. మహామంత్రి రాజుగారితో, "దీనికి ఇంతగా ఆలోచించవలసిన పనేముంది మహారాజా, మన సేనాని వీరవర్మకు ఆ పనిని అప్పగించండి" అన్నాడు. రాజు గారికి ఆ సలహా చాలా నచ్చింది. వెంటనే సేనాధిపతి వీరవర్మను పిలిపించి కోశాగారం తాళం చెవులు అతనికి అప్పగించి, వజ్రాలు కాపాడవలసిందిగా ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞానుసారం ఆ తాళం చెవులు తీసుకొని, మంత్రిగారి సమక్షంలో బాధ్యత స్వీకరించాడు వీరవర్మ. ఆ రోజు నుంచి కంటికిరెప్పలా ఆ కోశాగారాన్ని కాపాడుతున్నాడు. ఇలా నలభై రోజులు గడచిన తరువాత రామన్నదొర పూర్తిగా కోలుకొని ఆరోగ్యవంతుడయ్యాడు. కోటకు వెళ్లి రాజు గారిని కలిసి ఆరోగ్యం కుదుట పడిందని తెలిపాడు.

అతని ఆరోగ్యం కుదుటపడినందుకు రాజు గారు కూడా ఎంతో సంతోషించి, అతనికి పూర్వపు బాధ్యతను అప్పగించేయాలని నిర్ణయించుకున్నారు. వెనువెంటనే వీరవర్మకు కబురు పంపించారు. వీరవర్మ రాజాజ్ఞానుసారం కోటకి వచ్చి రాజుగారి సమక్షంలోనే తాళం చెవులు రామన్నదొరకు అప్పగించేసాడు. రామన్నదొర తన ఉద్యోగంలో చేరిపోయాడు.

www.sirimalle.com

మరునాడు ఉదయమే రామన్నదొర అంతఃపురానికి వచ్చి రాజదర్శనం కోరాడు. ఈ సమయంలో కోశాధికారికి తనతో ఏం పని, అని ఆశ్చర్యపోతూ అంతఃపురం బయటనున్న మహలుకు చేరుకున్నారు రాజుగారు. అక్కడే చేతులు కట్టుకొని నిలుచున్న రామన్నదొరని చూసి “కోశాధికారీ, ఈ సూర్యోదయ సమయంలో, ఏమిటి ఇలా వచ్చావు?” అని అడిగారు. రామన్నదొర తలవంచుకుని “మహాప్రభూ! మన్నించండి. రావలిసిన పరిస్థితి ఉత్పన్నమైనందుకే, రాకూడని వేళలో రావలిసి వచ్చింది. ప్రభూ! ఘోరం జరిగిపోయింది. కోశాగారంలో వజ్రాలు లేవు” అన్నాడు.

రాజు ఈ వార్త విని అవాక్కయి పోయాడు. తరువాత తేరుకుని “లేవా! ఎలా పోతాయి. నిన్న రాత్రి నువ్వు తనిఖీ చేయలేదా?” అని అడిగారు ఆందోళనగా.

“లేదు ప్రభూ! సేనాని దగ్గర్నుంచి తాళపు చెవులు తీసుకున్న తరువాత ఎప్పటిలాగే, కాపలా వాళ్ళను కనిపెడుతూ, అజమాయిషీ చేస్తూ రాత్రంతా గడిపాను. రివాజు ప్రకారం తెల్లవారగానే కోశాగారం తెరిచి చూశాను. అందులో ఉండవలసిన మూడు మహా వజ్రాలు మాయమయ్యాయి. మరుక్షణమే ఈ వార్త మీకు అందచేయాలని ఇలా వచ్చాను” అన్నాడు రామన్నదొర.

రాజు దీర్ఘంగా ఓ క్షణం అలోచించి “ఎవరక్కడ! సేనాపతిని దర్బారుకు హాజరవ్వమనండి” అని అన్నాడు.

రాజదర్బారు కొలువు తీరింది. రాజ గురువు, అధికారులు, ఉపమంత్రులూ అందరూ హాజరయ్యారు. సేనాధిపతి, కోశాధికారి కూడా కొలువులోనే ఉన్నారు. మహారాజు సభను ప్రారంభిస్తూ, జరిగినదంతా సభాసదులకు వివరించాడు. ఆ తర్వాత రాజగురువుతో “గురువర్యా! విచారణ ఎవరు చేస్తే ధర్మంగా ఉంటుందో సెలవీయండి. తక్షణమే విచారణ ప్రారంభిద్దాం”. అన్నాడు.

“మీరు ఈ బాధ్యతను సేనానికే ఎందుకు అప్పగించారు?” అని అడిగాడు రాజగురువు.

“మహామంత్రి గారు సూచించారు. ఆయన సూచన నాకు నచ్చింది” అన్నాడు మహారాజు. రాజ గురువు వెంటనే “అయితే ఈ విచారణ బాధ్యత కూడా మహామంత్రి గారికే అప్పగించండి” అన్నాడు.

"తమరు అజ్ఞాపించినట్టే చేస్తాను. కానీ మంత్రిగారు దైవకార్యం మీద మదనపల్లెకు వెళ్లారు. ఇంకా కోటకు చేరుకోలేదు" అన్నాడు రాజు.

"అంతవరకు కాలయాపన చేయడమెందుకు? ప్రాధమిక విచారణను మనమే ప్రారంభిద్దాం" అని రాజగురువు కోశాధికారి తో "భద్రతా ఏర్పాట్లు ఎలా చేశారు?" అని అడిగాడు. రామన్నదొర లేచి నిలుచుని చేతులు కట్టుకుని "ఆ కోశాగారంలో ఈ మూడు మహావజ్రాలు మాత్రమే భద్రపరచ బడ్డాయి మహాప్రభూ. అవి ఒక వెండి పెట్టెలో ఉంటాయి. ఆ పెట్టె భద్రపరచ బడిన గది ఉక్కుతో చేయబడింది. ఆ వెండి పెట్టెకూ, ఉక్కు గదికీ కూడా తాళాలు వేయబడ్డాయి. అంతేకాక ఆ ఉక్కు గది ఉన్న కోశాగారభవన ముఖ ద్వారానికి కూడా తాళాలు వేయబడతాయి. ఇవన్నీకాక బయట ప్రహరీ దగ్గరున్న సింహద్వారానికి కూడా తాళాలు వేస్తాం. ఈ నాలుగు తాళంచెవులు వున్నవాడు కూడా వజ్రాల దగ్గరకు చేరుకోలేడు ప్రభూ. కారణం ముఖద్వారం వద్ద ఇద్దరూ, ఉక్కుగది దగ్గర ఇద్దరూ, ఎల్లప్పుడూ కావలి కాస్తుంటారు" అన్నాడు రామన్నదొర.

"అలా కాపలాకాసే వీరులకు విరామమే ఉండదా?" అని అడిగాడు రాజగురువు.

"ఎందుకుండదు ప్రభూ, ఉంటుంది. కానీ నలుగురికీ ఒకేసారి ఉండదు. ఒకరు మాత్రం వెళతారు. వారు వచ్చిన తర్వాత రెండవ వారు వెళతారు. ఆ సమయంలో మిగిలిన ముగ్గురితో పాటు నేను కూడా కావలి కాస్తాను ప్రభూ! ఆ విధంగా ఎల్లప్పుడూ నలుగురు ఆ కోశాగారాన్ని కాపాడుతుంటారు" అన్నాడు రామన్నదొర.

"భద్రతా ఏర్పాటు చాలా పకడ్బందీగా చేశారు. మరి దొంగతనం ఎలా జరిగిందో ఆశ్చర్యంగా ఉంది. సరే, మీరు ఆశీనులు కావచ్చు" అన్నారు రాజగురువు. రామన్నదొర తన ఆసనంలో కూర్చున్నాడు. ఇంతలో సభలో కలకలం బయల్దేరింది. మహామంత్రి గారు సభకు వస్తున్నారు. సభికులందరూ మర్యాదపూర్వకంగా లేచి నిలుచున్నారు. మంత్రిగారు తిన్నగా రాజపీఠం దగ్గరికి వెళ్లి మహారాజుకు, రాజగురువుకు నమస్కరించాడు.

"రండి మంత్రివర్యా! ఆశీనులు కండి" అన్నారు రాజగురువు. మంత్రిగారు వచ్చి రాజగురువు ప్రక్కనే కూర్చున్నారు.

"మంత్రివర్యా, విషయం విన్నారా?" అన్నారు రాజుగారు.

www.sirimalle.com

"విన్నాను ప్రభూ! ఊరు ఊరంతా కథలుగా చెప్పుకుంటున్నారు"

"అలాగా, ఈ సంకట స్థితిలో మీరే విచారణ జరిపి, దోషిని బంధించి పోయిన మన అపురూపమైన వజ్రాలను తిరిగి సంపాదించాలి" అన్నారు రాజుగారు.

"మనకి ఎటువంటి నష్టం జరగలేదు మహారాజా. విచారణ ముగిసింది. నేరం జరిగిన మాట వాస్తవం. కానీ పోయినవి అసలు వజ్రాలు కావు. నకిలీ వజ్రాలు. గాజు ముక్కలు" అన్నాడు మంత్రి. సభలో అందరూ కరతాళధ్వనులు చేశారు. రాజు బ్రహ్మానందభరితుడై పోయాడు.

"ఏమంటున్నారు మహామంత్రీ! వజ్రాలు పోలేదా? ఏం జరిగిందో విపులంగా చెప్పండి" అన్నాడు రాజు మహదానందంగా.

మహామంత్రి తన గంభీరమైన కంఠంతో "మహారాజా! ఈ వజ్రాలు మన రాజ్యక్షేమానికి అత్యంత కీలకమైనవి. అపారమైన విలువ కలిగిన ఈ వజ్రాలు దొంగిలించబడ్డాయంటే, కోశాధికారి, వాటిని కాపలా కాస్తున్న నలుగురు వీరులే భాధ్యులు. కాబట్టి అలాంటి సాహసం ఇంతవరకు ఎవ్వరూ చేయలేదు. కానీ కొన్ని కారణాల వాళ్ళ అధికారం మారింది. దొంగకు ఇంతకంటే మంచి అవకాశం దొరకదు. ఒకవేళ దొంగతనమే జరిగి రాజ్యానికి నష్టం వాటిల్లితే మనం ఏం చేయగలం, విచారణ ఎలా జరుపగలం. కోశాధికారి, సైన్యాధిపతి ఇద్దరూ ముఖ్య అనుమానితులు అవుతారు. కానీ వారిలో అసలు దొంగను కనిపెట్టడం అసాధ్యమవుతుంది. ఈ ప్రమాదాన్ని నేను ముందే ఊహించాను. సైన్యాధిపతి కోశాగారం భాద్యత తీసుకునే సమయంలో అక్కడే వుండి, అతడికి తెలియకుండా నకిలీ వజ్రాలను ఉంచి, అసలు వజ్రాలను తెచ్చి నా దగ్గర జాగ్రత్తగా భద్రపరచాను. అవి ప్రస్తుతం నా దగ్గరే క్షేమంగా ఉన్నాయి. ఇంతకాలం సేనాధిపతి భద్రంగా కాపాడినవి నకిలీ వజ్రాలు. అవి నేను అనుమానించినట్టే దొంగిలించబడ్డాయి" అన్నాడు.

"అయితే వెంటనే విచారణ జరిపించి, దోషిని బంధించండి" అన్నాడు రాజు.

మహామంత్రి చిరునవ్వు నవ్వి "అది కూడా ముగిసింది ప్రభూ! సాక్ష్యాధారాలతో దోషం నిరూపించి, దోషిని మీ ముందు నిలబెడతాను" అన్నాడు.

www.sirimalle.com

"అదెలా సాధ్యం మంత్రివర్యా! విచారణ ప్రారంభించకుండా దోషిని ఎలా కనిపెడతారు" అన్నారు రాజుగారు.

"సైన్యాధికారి వీరవర్మకు బాధ్యతను అప్పగించిన నాడే, కోశాగారం దగ్గర, వీరవర్మ నివాసం దగ్గర, కోశాధికారి రామన్న ఇంటి దగ్గర గూఢచారులను నియమించాను మహారాజా! ఇలాంటి విషయాల్లో రెట్టింపు జాగ్రత్త వ్యవహరించాలిగా" అన్నాడు ముఖ్యమంత్రి. ఆ తర్వాత నగరపాలకుడి వైపు తిరిగి "నగరపాలకా! జరిగిందేమిటో ప్రభువులకూ, సభకూ విన్నవించు" అన్నాడు. నగరపాలకుడు ముందుకొచ్చి "మహారాజా, మంత్రిగారు స్వయంగా ఆజ్ఞాపించడంతో నేను ఇది చాలా ముఖ్యమైన కార్యమని గ్రహించి, కోశాధికారి రామన్నదొర ఇంటిదగ్గర నేనే స్వయంగా కాపు కాశాను. నిన్న రాత్రి భోజన విరామంలో ఇంటికి వచ్చిన రామన్నదొర తన పెరట్లో తులసికోట క్రింద తవ్వి దేనినో పాతిపెట్టడం గమనించాను. అతను తిరిగి కార్యనిర్వహణ కోసం వెళ్ళిపోగానే, అర్ధరాత్రి సమమయంలో ఎవ్వరూ లేనప్పుడు తవ్వి చూశాను. ఈ మూడు వజ్రాలు బయటపడ్డాయి. ఈ విషయం మంత్రిగారికి తెలియజేశాను. వీటిని తీస్కొని ఉదయం సభకు వచ్చేయమని నన్ను ఆదేశించారు" అన్నాడు నగరపాలకుడు తన చేతిలో ఉన్న మూడు వజ్రాలను అందరికీ చూపుతూ.

"చాలా సంతోషం మంత్రివర్యా! కానీ కోశాధికారి రామన్నదొర వాటిని ఎలా దొంగిలించగలిగాడు" అని అడిగారు మహారాజు. మహామంత్రి ముఖ్య గూఢచారి వైపు చూశాడు. ముఖ్య గూఢచారి ముందుకు వచ్చి "నగరపాలకుని ఆజ్ఞానుసారం నేను కోశాగారం వద్ద కాపుకాసి అంతా గమనించాను మహారాజా. ప్రతిరోజూ కేవలం ఒక్క వీరుడే విరామం కోసం వెళ్ళేవాడు. కానీ నిన్న రాత్రి రామన్నదొర ఒకేసారి ముగ్గుర్ని వరుసగా విరామానికి పంపేశాడు. అంతే కాదు ప్రభూ, మిగిలిన ఒక్క వీరుణ్ణి సింహద్వారం వద్ద కాపలా వుంచి లోపల ముఖద్వారం దాటి తాను ఉక్కు గది కాపలాకు వెళ్ళాడు. ఇద చాలా విడ్డూరంగా ఉందని వెంటనే ఈ విషయాన్ని నగర పాలకునికి తెలియచేసాను. అతను నన్ను ఉదయం కొలువుకు రమ్మని ఆదేశించాడు" అంటూ ముగించాడు. మహారాజు ఆనందభరితుడై "భేష్! మీరందరూ మీ కర్తవ్యాలని చక్కగా నిర్వర్తించారు" అన్నాడు మెచ్చుకుంటూ.

ఆ తర్వాత కోశాధికారి వైపు తిరిగి "రామన్నదొర నీవు చెప్పుకోవలసింది ఏమైనా ఉందా?" అని అడిగాడు మహారాజు.

రామన్నదొర తలదించుకున్నాడు మౌనంగా నిల్చుని.

"రామన్నదొరను దోషిగా నిర్ధారించడమైంది. అతను చేసింది దొంగతనం కాదు. రాజద్రోహమూ, ప్రజాద్రోహమూను. అతనికి మరణదండనే విధించాలి. కానీ గత ఇరవైయేళ్ళుగా రాజ్యానికి సేవ చేశాడు. ఆ కారణంగా అతనికి యావజ్జీవ కారాగారశిక్ష విధించడమైనది. అతని కుమారుడికి దివాణంలో అతని యోగ్యతకు తగిన ఉద్యోగం కల్పించమని ఆజ్ఞాపించడమైనది. నగరపాలకునికి కోశాధికారిగా పదోన్నతి కలిగించడమైనది. ముఖ్య గూఢచారిని నగరపాలకునిగా నియమించడమైనది. అంటూ తీర్పు చెప్పారు మహారాజుగారు.

"మహారాజుకు జై" అనే నినాదంతో సభ మార్మోగింది.

"తన చతురతతో, దక్షతతో, దేశభక్తి తో ఈ రాజ్యాన్ని కాపాడుతున్న మహామంత్రి గారికి, ఈ చిన్ని కానుక బహూకరిస్తున్నాం" అంటూ తన మెడలోని రత్నాలహారాన్ని తీసి మహామంత్రి మెడలో వేశారు మహారాజు గారు.

"మహామంత్రికి జై" అంటూ సభలోని వారందరూ నినాదాలు చేశారు.

(నాని సౌజన్యంతో)